క్లుప్తంగా

నూతన భవనాలు ప్రారంభించిన ఎంపీ నాని



తిరువూరురూరల్: మండలంలో నూతనంగా నిర్మించిన సచివాలయ, రైతు భరోసా కేంద్రాల భవనాలను సోమవారం విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్(నాని) ప్రారంభించారు. మండలంలోని మునుకుళ్ళ, చింతలపాడు గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలు, వామకుంట్ల, కొమ్మిరెడ్డిపల్లి గ్రామాల్లో సచివాలయాలు, ఆర్బీకే భవనాలను ఎంపీ ప్రారంభించారు. తిరువూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు, ఏఎంసీ చైర్మన్ శీలం నాగనర్సిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు యరమల రామచంద్రారెడ్డి, ఎంపీపీ గద్దల భారతి, సర్పంచులు, ఎంపీటీసీలు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రణాళికతో విజయానికి పునాది

జూపూడి(ఇబ్రహీంపట్నం): విద్య, ఉద్యోగ అవకాశాల్లో చక్కని ప్రణాళికతోనే విద్యార్థులు అవకాశాలు పొందుతారని బ్రైట్ హారిజన్స్ ఫౌండేషన్ హెచ్ఆర్డీ కన్సల్టెంట్ డాక్టర్ ఖాసిఫ్ రజాఖాన్ అన్నారు. జూపూడి నిమ్రా కళాశాలలో విద్యార్థుల భవిష్యత్ ప్రణాళిక, విద్యా, ఉద్యోగ అవకాశాలపై నిర్వహించిన సదస్సులో సోమవారం ఆయన పాల్గొన్నారు. ఎంట్రన్స్ పరీక్షలు, ఇంటర్వ్యూల్లో అవలంబించాల్సిన మెలకువలు తెలియజేశారు. ఖాసిఫ్ రజాఖాన్‌తో పాటు మొహిద్దీన్‌ను కళాశాల అకడమిక్ డైరెక్టర్ టి.నారాయణమూర్తి సత్కరించారు.

భద్రత జీవన విధానంలో భాగం కావాలి

ఇబ్రహీంపట్నం: భద్రత అనేది మన జీవన విధానంలో ఒక భాగం కావాలని ఎన్టీటీపీఎస్ చీఫ్ ఇంజినీర్ నవీన్ గౌతమ్ అన్నారు. సంస్థలో 53వ జాతీయ భద్రతా వారోత్సవాలను ఆయన సోమవారం ప్రారంభించారు. పరిశ్రమల్లో 85 శాతం ప్రమాదాలు ప్రమాదకర చర్యలు, మానవ తప్పిదాల వలన జరుగుతున్నాయని తెలిపారు. ప్రమాదాలు జీరో స్థాయికి తీసుకురావాలన్నారు.

ఎన్టీటీపీఎస్ పురోభివృద్ధికి సహకరించండి

ఇబ్రహీంపట్నం: ఎన్టీటీపీఎస్‌లో ఉద్యోగుల అసోసియేషన్‌లు, వాటి సభ్యులు సంస్థ పురోభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఎన్టీటీపీఎస్ చీఫ్ ఇంజినీర్ నవీన్ గౌతమ్ అన్నారు. ఏపీఎస్ఈబీ ఇంజినీర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు సోమవారం సీఈని కలిసి ఆక్సిజన్ మొక్క అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. నూతన కార్యవర్గ సభ్యులను సీఈ అభినందించారు. భవిష్యత్‌లో ఇంజినర్ల సమస్యల పరిష్కారంలో చొరవ చూపి సంస్థకు పేరు తీసుకురావాలన్నారు. బ్రాంచి కార్యదర్శి కేవీఆర్ చక్రపాణి, కోశాధికారి వెంకటరావు, జ్ఞానేశ్వరరావు, మధుబాబు, రవి, ప్రశాంతి పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు 40 మంది గైర్హాజరు

తిరువూరు: తిరువూరులోని నాలుగు పరీక్ష కేంద్రాల్లో సోమవారం జరిగిన ప్రథమ సంవత్సరం ఇంటర్మీడియెట్ పరీక్షల్లో ఇంగ్లిషు సబ్జెక్టుకు 40 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మొత్తం 1147 మంది విద్యార్థులకు గాను 1107 మంది హాజరైనట్లు అధికారులు తెలిపారు. తిరువూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, నాగార్జున, శ్రీనిధి జూనియర్ కళాశాలలు, అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకులాల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు.

వైఎస్సార్‌సీపీని మళ్లీ అధికారంలోకి తీసుకురావాలి

మైలవరం: సోషల్ మీడియా కలసికట్టుగా పని చేసి వైఎస్సార్‌సీపీని మళ్లీ అధికారంలోకి తీసుకురావాలని సోషల్ మీడియా జిల్లా అధ్యక్షురాలు చైతన్యరెడ్డి తెలిపారు. వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో సోషల్ మీడియా సభ్యుల సమావేశం వైఎస్సార్ సీపీ మైలవరం నియోజకవర్గ ఇన్‌చార్జి సర్నాల తిరుపతిరావు అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ సందర్భంగా చైతన్యరెడ్డి మాట్లాడుతూ అతి సామాన్య వ్యక్తిని నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. రేపు జరగబోయే ఎన్నికలు స్థానికుడు, స్థానికేతరుడికి మధ్య, సామాన్యుడికి, ధనిక వర్గానికి మధ్య యుద్ధం అని అన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అప్పిడి కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ బడుగు వర్గాల అభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్ కృషి చేస్తున్నారన్నారు. మైలవరం నియోజకవర్గ ఇన్‌చార్జి సర్నాల తిరుపతిరావు మాట్లాడుతూ ఒక సామాన్య వ్యక్తిని అయిన తనను నియోజకవర్గ ఇన్‌చార్జిగా చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌దే అన్నారు.

భక్తుల సౌకర్యాలకు ప్రాధాన్యం

బలివే(ముసునూరు): ఉత్సవాల నిర్వహణలో భక్తుల సౌకర్యాల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని దేవదాయ శాఖ డెప్యూటీ కమిషనర్ మేడేపల్లి విజయరాజు అన్నారు. బలివేలోని రామలింగేశ్వరస్వామిని ఆయన సోమవారం రాత్రి దర్శించుకుని, మహా శివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లను అధికారులతో కలిసి పరిశీలించారు. ఆలయ, ఉత్సవ ప్రాంగణం, స్నాన ఘట్టాల వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. మహిళా భక్తుల కోసం అదనంగా బాత్ రూమ్‌లను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. భక్తులకు అన్ని సౌకర్యాలు, పటిష్టమైన భద్రత కల్పించి ఉత్సవాలను విజయవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఈఓ సతీష్‌కుమార్, ఆలయ కమిటీ చైర్మన్ నాగేశ్వరరావు, ప్రధానార్చకుడు తోలేటి అరుణ భాస్కర్, సర్పంచ్ రావు ప్రవీణ్ సుధాకర్, జిల్లా దేవదాయ అధికారి రంగారావు, సిబ్బంది పాల్గొన్నారు.

అరాచకాలు సృష్టిస్తున్న వారిని తరిమికొట్టండి

- ఎంపీ కేశినేని శ్రీనివాస్(నాని)
- పలు గ్రామాల్లో ప్రభుత్వ భవనాలకు ప్రారంభోత్సవం



రేపూడిలో స్థలదాత వజ్రాల వెంకాయమ్మను సన్మానిస్తున్న ఎంపీ కేశినేని నాని, నల్లగట్ల స్వామిదాసు

ఎ.కొండూరు: అరాచకాలు సృష్టిస్తున్న వలసవాదులను నియోజకవర్గ ప్రజలు తరిమికొట్టాలని విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్(నాని) పిలుపునిచ్చారు. మండలంలోని పలు గ్రామాల్లో గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్ సెంటర్లను సోమవారం తిరువూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసుతో కలసి ఎంపీ నాని ప్రారంభించారు. మండలంలోని రామచంద్రాపురం గ్రామంలో రూ.40లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయాన్ని, చీమలపాడు గ్రామంలో రూ.23 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, రూ.20 లక్షలతో నిర్మించిన హెల్త్ క్లినిక్ సెంటర్, రేపూడి గ్రామంలో రూ.40లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయాన్ని, రూ.23 లక్షలతో కోడూరులో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని నాని మాట్లాడుతూ తిరువూరు నియోజకవర్గంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించటానికి చంద్రబాబునాయుడు టీడీపీ అభ్యర్థి కొలికపూడి శ్రీనివాసరావును పంపించారని, ప్రశాంతమైన వాతావరణంలో గొడవలు సృష్టించటానికి బయటనుంచి అరాచక వాది వస్తున్నాడని, నియోజకవర్గ ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. టీడీపీ అభ్యర్థి వల్ల సొంత టీడీపీ నాయకులు భవిష్యత్తులో ఎన్నో ఇబ్బందులు, అవమానాలు ఎదుర్కోవాల్సిన పరిస్థితులు ఏర్పడతాయన్నారు. అమరావతి ఉద్యమం పేరుతో ఉద్యమకారుల వద్ద చందాలు వసూలు చేశాడని, అలాగే ఈ నియోజకవర్గంలో వ్యాపారులు, వర్తకులు, వైద్యుల వద్ద చందాలు వసూలు చేస్తాడని, జాగ్రత్తగా ఉండాలని పిలుపునిచ్చారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి రాష్ట్రం అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. రామచంద్రాపురం గ్రామంలో సంక్షేమ పథకాల కింద రూ.21కోట్లు, రేపూడిలో సంక్షేమ పథకాల కింద రూ.23 కోట్లు దళారీ వ్యవస్థ లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి దక్కిందన్నారు. రాష్ట్రంలో అన్ని గ్రామాల్లో రూ.30వేల కోట్లతో గ్రామ సచివాలయాలు నిర్మించి అభివృద్ధి పథంలో నడిపిస్తుంటే ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు నాయుడు గత టీడీపీ పరిపాలనలో ఒక్క సచివాలయం కూడా శాశ్వత నిర్మాణం చేయలేదన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అర్హులైన నిరుపేదలందరికీ ఆరోగ్యశ్రీ ద్వారా మెరుగైన వైద్యం, నాడు-నేడు పథకం ద్వారా నిరుపేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తున్నారన్నారు.

స్వామిదాస్ పక్కా లోకల్...

స్వామిదాస్ పక్కా లోకల్ అని, నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటారని ప్రజలకు సేవ చేయటానికి వచ్చారని మీ అందరి సహకారంతో స్వామిదాసును అఖండ మెజార్టీతో గెలిపించాలని ఎంపీ నాని కోరారు. రేపూడి గ్రామంలో గ్రామ సచివాలయాన్ని ఏర్పాటు చేయటానికి సహకరించిన కీర్తి శేషులు వజ్రాల రాఘవరెడ్డి జ్ఞాపకార్థం వారి సతీమణి వజ్రాల వెంకాయమ్మ, వారి కుమారులు వజ్రాల సీతారామిరెడ్డి, వజ్రాల బ్రహ్మానందరెడ్డి, రామచంద్రాపురం గ్రామంలో సచివాలయం ఏర్పాటు చేయటానికి కీర్తి శేషులు గంజి కోటయ్య, శ్రీమతి నరసమ్మ గార్ల జ్ఞాపకార్థంతో స్థలదాతలు వారి కుమారులు గంజి నారాయణ, గంజి ఎర్రయ్య, మేనల్లుడు సర్పంచ్ ఎం.సీతయ్య, కోటమ్మలను అభినందించారు. తిరువూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మహాత్మాగాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం తీసుకొచ్చారన్నారు. నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండి నిస్వార్థంగా ప్రజాసేవ చేస్తానన్నారు. నియోజకవర్గంలో స్వచ్ఛమైన కృష్ణా జలాలు సరఫరా చేయటానికి ఎంపీ కేశినేని నాని సహకారంతో ఇంటింటికీ తాగునీరు త్వరలో అందిస్తామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ భూక్యా గనియా, ఎంపీపీ కాలసాని నాగలక్ష్మి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకులు నరెడ్ల వీరారెడ్డి, ఏఎంసీ చైర్మన్ నాగి నర్సిరెడ్డి, సర్పంచులు వజ్రాల సత్యవేణి, బ్రహ్మానందరెడ్డి, ముచ్చు సీతయ్య, మోర్ల లక్ష్మి, టి.సురేష్, ఎంపీటీసీలు బి.ఆదిలక్ష్మి, కె.నాగమణి, వి.కృష్ణవేణి, నాయకులు ఎ.వెంకటరెడ్డి, టి.వెంకటేశ్వరరెడ్డి, కె.శివ, ఎంపీడీఓ శ్రీకృష్ణపరమాత్మ, తహసీల్దార్ రియాస్ హుస్సేన్, పలు శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, ఎంపీటీసీలు, సర్పంచులు, పీఏసీఎస్ అధ్యక్షులు పాల్గొన్నారు.

భద్రత జీవన విధానంలో చాలా ముఖ్యం



ఆగిరిపల్లి: ప్రతి ఒక్కరూ భద్రతా ప్రమాణాలను పాటించాలని తహసీల్దార్ మృత్యుంజయరావు తెలిపారు. ఆగిరిపల్లిలో సోమవారం మేఘ గ్యాస్ ఆధ్వర్యంలో జాతీయ భద్రతా వారోత్సవాలను తహసీల్దార్ ప్రారంభించారు. జీవన విధానంలో భద్రత అనేది ఒక ముఖ్య భాగం కావాలని అన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ తవీరియా నాయక్, ప్రాజెక్టు మేనేజర్ రవికిరణ్, సేఫ్టీ ఇన్‌చార్జ్ రమేష్, మేఘా గ్యాస్ సిబ్బంది పాల్గొన్నారు.

30 లీటర్ల సారా స్వాధీనం

నూజివీడు: మండలంలోని ఓగిరాల తండాలో స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ (సెబ్) సిబ్బంది సోమవారం దాడులు చేసి 30 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ తెలిపారు. గ్రామానికి సమీపంలోని తోటల్లో, అటవీ ప్రాంతంలో నిర్వహించిన తనిఖీల్లో సారా తయారీకి సిద్ధంగా ఉన్న వెయ్యి లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ సారా తయారు చేసినా, విక్రయించినా, రవాణా చేసినా, నల్ల బెల్లం విక్రయించినా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

తిరువూరు ప్రజలపై కక్ష తీర్చుకున్న చంద్రబాబు

ఎంపీ కేశినేని నాని

తిరువూరు: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడుకు తిరువూరు నియోజకవర్గంపై విపరీతమైన కోపం ఉందని, అందుకే ప్రజల్ని ఇబ్బందుల పాలు చేసే అభ్యర్థిని రంగంలోకి దింపి తిరువూరు ప్రజలపై కక్ష తీర్చుకున్నారని విజయవాడ పార్లమెంటు సభ్యుడు కేశినేని శ్రీనివాస్(నాని) విమర్శించారు. సోమవారం తిరువూరు నియోజకవర్గంలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్న నాని మాట్లాడుతూ తిరువూరులోని వ్యాపారులు, వైద్యులు అప్రమత్తంగా ఉండాలని, రానున్న ఎన్నికల్లో తమ క్షేమాన్ని కోరే అభ్యర్థిని ఎన్నుకోవాలని సూచించారు. అమరావతి ఉద్యమం పేరిట రైతుల వద్ద చందాలు వసూలు చేయడం, సినీ దర్శకుడి తల నరికితెస్తే కోటి రూపాయలిస్తానని బేరం పెట్టేవారు, టీవీల్లో చర్చకు వచ్చిన వారిపై చెప్పులతో దాడిచేసే వారిని తిరువూరు అభ్యర్థిగా నిలబెట్టారన్నారు. విజ్ఞత లేకుండా ఎదుటి వ్యక్తులపై సభలు, సమావేశాల్లో వ్యక్తిగత ఆరోపణలు చేస్తున్న టీడీపీ అభ్యర్థికి ఓటర్లు తగు రీతిలో సమాధానం చెప్పాలని విజ్ఞప్తి చేశారు. తిరువూరు వైఎస్సార్‌సీపీ అభ్యర్థి స్వామిదాసు రెండుసార్లు ఎమ్మెల్యేగా పనిచేసి ప్రజల మన్ననలు పొందారని, ఎవరినీ ఇబ్బంది పెట్టిన దాఖలాలు లేవన్నారు. స్వామిదాసు ఎవరినైనా ఇబ్బంది పెట్టారని నిరూపిస్తే తాను, స్వామిదాసు కూడా రాజకీయాల నుంచి తప్పుకుంటామన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిక



చిట్టేలలో టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిన కార్యకర్తలను అభినందిస్తున్న ఎంపీ నాని, స్వామిదాసు

చిట్టేల(తిరువూరురూరల్): మండలంలోని చిట్టేలలో సోమవారం విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్(నాని) సమక్షంలో పలువురు తెలుగుదేశం పార్టీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరారు. టీడీపీ సీనియర్ కార్యకర్తలు వేల్పుల సుధాకర్, దయ్యాల సుందరరావు, సంజయ్ కుమార్, గంటా మధుబాబు, పాలకుర్తి వెంకటేశ్వర్లు, తలమాల రాము, రాయల రాణి, జీనుగు రవికుమారి, దయ్యాల రాజమణి, కనపర్తి బేబీ, బర్రె కృపానందం, చిరసాని స్వప్న, జీనుగు శ్రీకాంత్, గొల్లమందల ఏసు, వేము మరియమ్మ, పొనెం పెద్దిరాజు, ఇడుపుల పాటి శివ, రేలంగి మాచర్ల, కాలసాని మహేష్ తదితరులకు పార్టీ కండువా కప్పిన ఎంపీ వారిని అభినందించారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు, అంజనేయపురం సర్పంచి మామిడి కుటుంబరావు, ఎంపీపీ గద్దల భారతి, జెడ్పీటీసీ సభ్యుడు యరమల రామచంద్రారెడ్డి, ఎంపీటీసీ కోటేశ్వరి, పీఏసీఎస్ చైర్‌పర్సన్లు, సీతారామయ్య, నవీన్, రవి, నారాయణరావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మహిళా సాధికారత, ఆర్థికాభివృద్ధికి కృషి

న్యాయవాది నండూరి పద్మావతి



నూజివీడులో మాట్లాడుతున్న న్యాయవాది నండూరి పద్మాంజలి

నూజివీడు: మహిళల సాధికారిత, ఆర్థికాభివృద్ధి కోసం సమాజంలోని ప్రతి ఒక్కరూ కృషి చేయాలని న్యాయవాది నండూరి పద్మాంజలి అన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు, నర్సింగ్ విద్యార్థులకు, పాఠశాల విద్యార్థులకు అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఐసీడీఎస్ సీడీపీఓ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ ఆడపిల్లలకు బాల్య వివాహాలు చేయకుండా వారికి ఉన్నత విద్యనందించాలన్నారు. బాల్య వివాహాలు చేస్తే చట్ట ప్రకారం వివాహం చేసిన వారు, ప్రోత్సహించిన వారు సైతం శిక్షకు గురవుతారన్నారు. బాల్యం నుంచి పిల్లలకు పౌష్టికాహారం అందించాలని, అప్పుడే వారు ఆరోగ్యవంతంగా ఉండి జీవితంలో సమర్థంగా రాణించగలుగుతారన్నారు. వైఎస్సార్ కాంతి పథం ఏపీఎం దయాల రాజశేఖర్ మాట్లాడుతూ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వాలు అనేక పథకాలను అమలు చేస్తున్నాయన్నారు. వీటన్నింటినీ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీడీపీవో ఎస్వై నూరాణి, ఏసీడీపీవో నాగేశ్వరి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలను సందర్శించిన ఐబీ కరిక్యులం రూపకల్పన సిబ్బంది



మద్దులపర్వ పాఠశాలను సందర్శించిన ఐబీ కరిక్యులం రూపకల్పన సభ్యులు

రెడ్డిగూడెం: మండలంలోని మద్దులపర్వ ఆదర్శ పాఠశాలను ఐబీ కరిక్యులం రూపకల్పన సభ్యులు సోమవారం సందర్శించారు. పాఠశాలలో వసతులు, సదుపాయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా నాడు-నేడు పథకంతో కలిగిన ఉపయోగాల గురించి ప్రధానోపాధ్యాయుడు ఎ.వీరరాజును అడిగి తెలుసుకున్నారు. ఏపీ అనుసరిస్తున్న విద్యా విధానాలు ఇంటర్నేషనల్ బాకాలారీయేట్‌కు దగ్గరగా ఉన్నాయని ఐబీ కరిక్యులం రూపకల్పన సభ్యులు కొనియాడారు. ఐబీ కరిక్యులం రూపకల్పన సభ్యులు జెన్నీఫర్ ప్లైజొ కోచ్(సీనియర్ లెర్నింగ్ అండ్ ఆర్కిటెక్స్ ప్రొఫెషనల్ లెర్నింగ్ యూఎస్ఏ) డాక్టర్ హెలెన్ వీవర్స్(కరిక్యులం స్పెషలిస్ట్ యూకే),కల్పనా శైల తదితరులు పాల్గొన్నారు.

తిరువూరులో పోలీసుల కవాతు

తిరువూరు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో తిరువూరు పట్టణంలో కేంద్ర బలగాలు, పోలీసులు కవాతు నిర్వహించారు. ఎన్నికల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కేటాయించిన కేంద్ర బలగాలు ఏసీపీ మురళీ మోహన్ ఆధ్వర్యంలో రాజుపేట నుంచి బైపాస్‌రోడ్డు వరకు కవాతు జరిపాయి. సీఐ అబ్దుల్ నబీ, తిరువూరు ఎస్ఐ సత్యనారాయణ, గంపలగూడెం, ఎ.కొండూరు, విస్సన్నపేట మండలాల పోలీసులు పాల్గొన్నారు.



ప్రారంభానికి సిద్ధమైన వైఎస్సార్‌సీపీ కార్యాలయం



తిరువూరు: తిరువూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ కార్యాలయం ప్రారంభానికి సిద్ధమైంది. స్థానిక స్వామి అయ్యప్ప దేవాలయం ఎదురుగా ఉన్న భవనాన్ని పార్టీ కార్యాలయం నిర్వహణకు ఎంపిక చేశారు. ఈ నెల 6న ఎంపీ కేశినేని శ్రీనివాస్(నాని) ఈ కార్యాలయాన్ని ప్రారంభించనున్నారు.

నేడు రిజిస్ట్రేషన్ పట్టాలు పంపిణీ

ఇబ్రహీంపట్నం: జగనన్న కాలనీల్లో స్థలాలు పొందిన లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పట్టాల పంపిణీ కార్యక్రమం ఎంపీపీ కార్యాలయం వద్ద మంగళవారం ఉదయం జరుగుతుందని ఎంపీడీవో ఉమాదేవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ఇచ్చిన ఇళ్ల స్థలాల పట్టాలను ఇటీవల కాలంలో లబ్ధిదారులకు ప్రభుత్వం పక్కా రిజిస్ట్రేషన్ చేసింది. పట్టాల పంపిణీ కార్యక్రమంలో రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్, ఎంపీ కేశినేని నాని, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి సర్నాల తిరుపతిరావు హాజరై లబ్ధిదారులకు అందజేస్తారు. లబ్ధిదారులందరూ హాజరు కావాలని ఎంపీడీవో కోరారు.

ఆరవ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు

రెడ్డిగూడెం: మండలంలోని ఆదర్శ పాఠశాలలో ఆరవ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎ.వీరరాజు తెలిపారు. ఏప్రిల్ 21వ తేదీన మద్దులపర్వ మోడల్ స్కూలులో పరీక్ష నిర్వహిస్తారన్నారు. సంబంధిత విద్యార్థులు ప్రభుత్వ లేక ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 2023-24 విద్యా సంవత్సరంలో చదివి ఉండాలన్నారు. అభ్యర్థులు ఈనెల 3వ తేదీనుంచి 31వ తేదీ లోపు పరీక్ష రుసుం చెల్లించాలన్నారు. ఓసీ, బీసీ అభ్యర్థులు రూ.150, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.75 చెల్లించాలన్నారు. ఆదర్శ పాఠశాలలో ప్రవేశాలకు 70757 73456, 82475 52027 నంబర్లను సంప్రదించాలన్నారు.

దివ్యాంగ బాలలకు కృత్రిమ కాళ్లు అందజేత



ఆగిరిపల్లి: ఇద్దరు దివ్యాంగ బాలలకు దాతలు కృత్రిమ కాళ్లను అందజేశారు. మండలంలోని తోటపల్లి లోని హీల్ సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న కృత్రిమ అవయవ కేంద్రంలో సోమవారం కృష్ణ చైతన్య డైరీ ఫాం అధినేత అరవపల్లి రామకృష్ణ, దుర్గభారతి, చిట్టిబాబు, భ్రమరాంబ అందజేసిన విరాళంతో కర్నూలు జిల్లాకు చెందిన విష్ణుకు కృత్రిమ కాళ్లు అందజేశారు. ప్రకాశం జిల్లా వెంకటగిరికి చెందిన వెంకట సూర్యకుమార్‌కు ధన శిక్ష చారిటీస్ ప్రతినిధుల ద్వారా కృత్రిమ కాళ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో హీల్ ప్రిన్సిపాల్ సాయిబాబు, సీఈవో కూరపాటి అజయ్ కుమార్, టెక్నీషియన్ చిన్నా పాల్గొన్నారు.

హైదరాబాద్ వెళ్లి పింఛన్ అందజేత



ముసునూరు: ముసునూరుకు చెందిన కోరు ఏసుపాదం వైఎస్సార్ పింఛన్ కానుక అందుకోవలసిన సమయానికి 10 రోజుల ముందు హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్నాడు. దీంతో గ్రామ వలంటీరు సౌజన్య సోమవారం ఉదయం బయలుదేరి సాయంత్రానికి హైదరాబాద్ చేరుకుని లబ్ధిదారుడు ఏసుపాదంను పరామర్శించి, పింఛన్ నగదును అందజేశారు. ఈ సందర్భంగా వలంటీరును వైఎస్సార్ సీపీ నేతలు అభినందించారు.

అర్జీలను గడువులోగా పరిష్కరించాలి

ఆర్డీఓ వై.భవానీశంకరి



నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో అర్జీలను స్వీకరిస్తున్న ఆర్డీఓ భవానీశంకరి

నూజివీడు: జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చిన అర్జీలను గడువులోగా తప్పనిసరిగా పరిష్కరించాలని ఆర్డీఓ వై.భవానీశంకరి అధికారులకు స్పష్టం చేశారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహించి డివిజన్‌లోని పలు మండలాల నుంచి వచ్చిన ప్రజల వద్ద అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ తమ సమస్యలు పరిష్కారమవుతాయనే నమ్మకంతో ప్రజలు స్పందనలో అర్జీలను అందజేస్తున్నారని, ఈ అర్జీల పరిష్కారంలో అలసత్వం వహించిన అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఒకవేళ సమస్యను పరిష్కరించడానికి వీలులేకపోతే సంబంధిత కారణాన్ని ఆన్‌లైన్‌లోనే తెలపాలన్నారు. స్పందనలో 10 అర్జీలు రాగా వాటిని ఆన్‌లైన్ చేసి సంబంధిత అధికారులకు పంపారు. భూములను ఆన్‌లైన్ చేయాలని, ఆక్రమణలు తొలగించాలని, పింఛను మంజూరు చేయాలని తదితర సమస్యలపై అర్జీలు ఇచ్చారు. స్పందనలో ఏసీడీపీవో నాగేశ్వరి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ చిలుకూరి భాస్కరరెడ్డి, డీఎల్‌పీవో సుందరి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

వలంటీర్లు నిస్వార్థ సేవకులు



మూలపాడులో వలంటీర్లకు ప్రోత్సాహకాలు అందజేస్తున్న తిరుపతిరావు, శ్రీదేవి తదితరులు

ఇబ్రహీంపట్నం: గ్రామ, వార్డు వలంటీర్లు ప్రజలకు నిస్వార్థంగా సేవలు అందిస్తున్నారని మైలవరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ సర్నాల తిరుపతిరావు అన్నారు. ఇబ్రహీంపట్నం, కొండపల్లి, మూలపాడు గ్రామాల్లో సోమవారం వేరువేరుగా జరిగిన వలంటీర్లకు వందనం కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీర్ల వ్యవస్థ దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. అనేక రాష్ట్రాల్లో వలంటీర్ల వ్యవస్థ ప్రవేశ పెట్టేందుకు సన్నాహాలు చేయడం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనాదక్షతకు నిదర్శనమన్నారు. అనంతరం వలంటీర్లను సత్కరించారు. ప్రభుత్వ ప్రోత్సాహకాలు అందజేశారు. జెడ్పీ వైస్ చైర్మన్ గరికపాటి శ్రీదేవి, వైఎస్సార్ సీపీ ముఖ్యనాయకులు జోగి రాము, మేడపాటి నాగిరెడ్డి, బొంతా సాంబశివరావు, చింకా శ్రీనివాసరావు, మిక్కిలి శరభయ్య, కోసూరు వెంకటేష్, ఎస్.ప్రసన్నబోసు, కె.గురవయ్య, నల్లమోతు సుభాష్, గుంజా శ్రీనివాస్, నాగరాజకుమారి, కొమ్మూరు రామకోటేశ్వరరావు, కౌన్సిలర్‌లు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

రెడ్డిగూడెంలో వలంటీర్లకు వందనం

రెడ్డిగూడెం: రెడ్డిగూడెం మండల పార్టీ కార్యాలయంలో సోమవారం వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మైలవరం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త సర్నాల తిరుపతిరావు, జెడ్పీటీసీ పాలంకి విజయభాస్కరరెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బలగాని తిరుపతిరావు, సర్పంచ్ మల్లాది రాణి, మండల సచివాలయాల కన్వీనర్ ఉయ్యూరు భరత్‌కుమార్‌రెడ్డి, తోటకూర రవిబాబు, ఉయ్యూరు సత్యనారాయణరెడ్డి, కలకొండ రామారావు, ఓబులాపురం సర్పంచ్ నూనె అప్పిరెడ్డి, ఒగ్గు జమలారెడ్డి, వాసు, భీమిరెడ్డి కృష్ణారెడ్డి, శెట్టిపల్లి వెంకటేశ్వరరావు, మైలమాల కాంతారావు, ఎంపీటీసీ సభ్యులు శెట్టిపల్లి మాధవీలత తదితరులు పాల్గొన్నారు.

కంటిపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలి



అన్నేరావుపేట గ్రామంలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

రెడ్డిగూడెం: అభ్యుదయ యువశక్తి సంఘం ఆధ్వర్యంలో మండలంలోని అన్నేరావుపేట పరిధిలోని రైతుభరోసా కేంద్రం వద్ద సోమవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో 75 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు కంటి వైద్యులు పల్లెపాం లక్ష్మీకుమారి తెలిపారు. వీరిలో 15 మందికి కంటిలో శుక్లములు, కంటి పొరలు ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. వీరిని విజయవాడలోని చైతన్య కంటి ఆసుపత్రికి రిఫర్ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బి.ప్రశాంతి, ఎంపీటీసీ సభ్యులు శెట్టిపల్లి మాధవీలత, వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీపీ మైలమాల కాంతారావు, అభ్యుదయ యువశక్తి సంఘం అధ్యక్షుడు చింతిరాల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు బలివేలో శివరాత్రి ఉత్సవ ఏర్పాట్లపై సమావేశం

ముసునూరు: ప్రసిద్ధ శైవ క్షేత్రం బలివేలో మార్చి 7 నుంచి 9 వరకు నిర్వహించనున్న బలివే రామలింగేశ్వర స్వామి మహా శివ రాత్రి ఉత్సవ ఏర్పాట్లపై నూజివీడు ఆర్డీఓ వై.భవానీశంకరి ఆధ్వర్యంలో అధికారులతో రెండవ విడత సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించనున్నట్లు ఈఓ సతీష్‌కుమార్, కమిటీ అధ్యక్షుడు నాగుల నాగేశ్వరరావు సోమవారం తెలిపారు. మంగళవారం ఉదయం 11 గంటలకు బలివే ఆలయ ప్రాంగణంలో ఉత్సవాల నోడల్ అధికారి, తహసీల్దార్ జవహర్ బాజి అధ్యక్షతన అన్ని శాఖల అధికారులతో ఈ సమన్వయ సమావేశం నిర్వహిస్తామన్నారు. అధికారులంతా సమగ్ర సమాచారంతో సకాలంలో సమావేశానికి హాజరు కావాలని కోరారు.